ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 17 మార్చి 2024





సంగ్రామ భేరి..!

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ

- 18న నోటిఫికేషన్.. ఏప్రిల్ 25 వరకూ నామినేషన్లు
- 26న పరిశీలన.. 29న ఉపసంహరణ
- మే 13న పోలింగ్... జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఆరు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారు
- ప్రచారంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి దూకుడు
- ఆలస్యంగా అధికార పార్టీ అభ్యర్థులు ఖరారు
- అభ్యర్థులను ఖరారు చేయని ఇండియా కూటమి

సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి ముహూర్తం ఖరారైంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీలో శనివారం మధ్యాహ్నం వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 25 వరకూ నామినేషన్ల స్వీకరణకు గడువు విధించారు. 26న నామినేషన్లను పరిశీలిస్తారు. 29న నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. నోటిఫికేషన్ విడుదలైన 55 రోజుల అనంతరం, మే 13న రాష్ట్రంలో పోలింగ్ జరుగుతుంది. ఆ తరువాత 22 రోజులకు, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ రెండున్నర నెలలకుపైగా కొనసాగనుంది.

– అనంతపురం, ఆంధ్రజ్యోతి



కోడ్ అమల్లోకి..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే, శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఆ క్షణం నుంచి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు కోడ్ వర్తించనుంది. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసింది. కోడ్ అమల్లోకి వచ్చినందున బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రహదారులు, బస్సులపైన రాజకీయ నేతల ప్రకటనల పోస్టర్లు తొలగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లలో సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధుల ఫొటోలను తీసేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు, యంత్రాంగం బదిలీలపై నిషేధం అమలులోకి వచ్చింది. అధికారులతో మంత్రులు ఎలాంటి సమీక్షలు నిర్వహించకూడదు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయకూడదు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 24 గంటల్లోగా జిల్లాలోని ప్రభుత్వానికి సంబంధించి అన్నిరకాల వాల్‌రైటింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలను తొలగించాల్సి ఉంటుంది. వలంటీర్లు ఎన్నికలకు దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

ఎనిమిది నియోజకవర్గాలలో 19.94 లక్షల మంది ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
రాయదుర్గం	1,29,090	1,31,736	33	2,60,859
ఉరవకొండ	1,09,205	1,12,788	30	2,22,723
గుంతకల్లు	1,31,304	1,35,656	76	2,67,036
తాడిపత్రి	1,21,499	1,22,552	24	2,44,075
శింగనమల	1,22,341	1,23,257	27	2,45,625
అనంతపురం అర్బన్	1,36,761	1,41,679	35	2,78,475
కళ్యాణదుర్గం	1,13,195	1,14,236	07	2,27,438
రాప్తాడు	1,24,081	1,24,219	13	2,48,312
మొత్తం	9,88,176	10,06,123	245	19,94,544



కూటమి రెడీ

జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇప్పటికే ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రాయదుర్గం, రాప్తాడు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల నుంచి టీడీపీ అభ్యర్థులు బరిలో ఉంటారు. రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, రాప్తాడు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత, ఉరవకొండ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ, తాడిపత్రి నుంచి జేసీ అశ్మిత్‌రెడ్డి, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు టీడీపీ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఈ నెల 17వతేదీ ఆదివారం చిలకలూరిపేటలో నిర్వహించే కూటమి బహిరంగ సభ అనంతరం అధికారికంగా అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది. కూటమి పార్లమెంటు అభ్యర్థి విషయంలో స్పష్టత రాలేదు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించింది. కానీ హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసేందుకు బీకే పార్థసారథి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంత సందిగ్ధత నెలకొంది. హిందూపురం స్థానం నుంచి బీకే పోటీచేస్తే.. అనంతపురం నుంచి ఎవరిని బరిలోకి దింపాలనే అంశంపై టీడీపీ అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. పార్లమెంటు అభ్యర్థుల విషయంలోనూ మరో నాలుగు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



వైసీపీ అభ్యర్థులు ఖరారు

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు వైసీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ సమక్షంలో ఇడుపులపాయలో శనివారం పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. అనంతపురం అర్బన్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం నుంచి ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, రాప్తాడు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తాడిపత్రి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఉరవకొండ నుంచి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, శింగనమల నుంచి ఎం.వీరాంజనేయులు, రాయదుర్గం నుంచి మెట్టు గోవిందురెడ్డి అభ్యర్థిత్వాలను అధికారికంగా ప్రకటించారు. అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్‌నారాయణను ప్రకటించారు.

తేల్చని ఇండియా కూటమి

కాంగ్రెస్, వామపక్ష కూటమి (ఇండియా) ఇప్పటి వరకూ అభ్యర్థులను ఖరారు చేయలేదు. ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న పార్టీ నాయకుల నుంచి కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం దరఖాస్తులను స్వీకరించింది. వాటిని పరిశీలించి, రెండుమూడు రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌తో జతకట్టిన సీపీఐ, సీపీఎం కూడా తమ అభ్యర్థులను బరిలో దించాలని యోచిస్తున్నాయి. పొత్తులో భాగంగా వామపక్షాలకు ఏ ఏ నియోజకవర్గాలను కేటాయిస్తారో స్పష్టత లేదు.

ఇప్పటికే ప్రచార హోరు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో దూకుడు పెంచేందుకు సమాయత్తమవుతున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరఫున టిక్కెట్లు దక్కించుకున్న టీడీపీ అభ్యర్థులు వారి వారి నియోజకవర్గాల్లో ప్రచారంలో దూసుకుపోతున్నారు. అధికార వైసీపీ జిల్లాలోని మెజార్టీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసే విషయంలో జాప్యం చేసింది. ఒకటిరెండు నియోజకవర్గాల సిట్టింగ్ ఎమ్మెల్యేలు మినహా.. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రచారానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. గడప గడపకు కార్యక్రమం మినహా.. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టలేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో ఇక నుంచి ప్రచారాన్ని ప్రారంభించేందుకు అధికార పార్టీ అభ్యర్థులు సిద్ధమౌతున్నారు.

కోడ్ అమలులోకి వచ్చింది

- బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించండి
- వలంటీర్లు, ఉద్యోగులు ప్రచారం చేస్తే చర్యలు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమి



అనంతపురం టౌన్, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, కోడ్‌ను జిల్లాలో కఠినంగా అమలు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజకీయ పార్టీలు ఏర్పాటుచేసిన బ్యానర్లు, హోర్డింగ్‌లు, పోస్టర్లను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ భవనాలపై ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్లు, ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న నాయకుల ఫొటోలను కూడా తొలగించాలని ఆదేశించారు. విగ్రహాలు కనబడకుండా ముసుగులు తొడగాలని సూచించారు. వాటర్ ట్యాంకులు, అంబులెన్స్‌లు, ఎండీయూ వాహనాలపై ఉన్న నాయకుల ఫొటోలను తొలగించాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కంట్రోల్ రూమ్ సేవలు శనివారం నుంచే అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఎక్కడ ఏమి జరిగినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేయవచ్చని, ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. వాటిని 24 గంటల్లోగా విచారించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులందరూ ఒక బృందంగా ఏర్పడి, కోడ్‌ను అమలు చేయాలని, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

ప్రచారంలో పాల్గొంటే చర్యలు

అధికార పార్టీ తరఫున వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రచారంలో పాల్గొంటున్నారని ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాజకీయ పార్టీల కార్యక్రమాలలో పాల్గొనకూడదని అన్నారు. ఎవరైనా పాల్గొన్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇఫ్తార్	: ఆదివారం సాయంత్రం 06:32
సెహరీ	: సోమవారం ఉదయం 05:09

ఉత్తుత్తి చరిత్ర..!

- శింగనమల చెరువు వద్ద పైలాన్ ఆవిష్కరణ
- లోకలైజేషన్ చేశామని ఎమ్మెల్యే గొప్పలు
- వృథా నీటికే జీఓ అంటున్న అధికారులు



శింగనమల చెరువు వద్ద పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

శింగనమల, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోగా ఉత్తుత్తి ఘనతను చాటుకోవాలని చూశారు శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి. శింగనమల చెరువు లోకలైజేషన్ చేసి, చరిత్రను తిరగరాశామని చెప్పుకుంటూ.. శనివారం పైలాన్‌ను ఆవిష్కరించారు. లోకలైజేషన్ ఉత్తర్వులను జనవరుల శాఖ 2022లోనే జారీ చేసింది. ఆ ఏడాది మే 31న ఈ మేరకు జీవో నంబర్ 1339ను జారీ చేసింది. అప్పట్లో వర్షాలు బాగా కురవడంతో చెరువులోకి నీరు చేరింది. పై ప్రాంతంలోని జలాశయాలు నిండటంతో వృథా నీటిని కూడా శింగనమల చెరువుకు మళ్లించారు. అలా చెరువుకు చేరిన నీటిని తామే తెచ్చామని ఎమ్మెల్యే, ఆమె భర్త గొప్పలు చెప్పుకున్నారు. గత ఏడాది (2023లో) వర్షాలు రాకపోవడంతో చెరువులో ఉన్న నీరు అడుగంటింది. అయితే, చెరువు లోకలైజేషన్ అయినందున.. పై నుంచి వాటా నీరు వస్తుందని మత్స్యకారులు, ఆయకట్టు రైతులు, మండల ప్రజలు భావించారు. కానీ చుక్కనీరు రాలేదు. దీంతో లోకలైజేషన్ ఉత్తిదే అని తేలిపోయింది. లోకలైజేషన్ చేశారనే నమ్మకంతో చెరువు వద్ద గత ఏడాది రైతుల చందాలతో పైలాన్ ఏర్పాటు చేశారు. ఎందుకోగానీ, అప్పట్లో దాన్ని ఆవిష్కరించలేదు. తాజాగా, ఎన్నికల కోడ్‌కు కొన్ని గంటల ముందు హడావుడిగా ఎమ్మెల్యే పైలాన్‌ను ఆవిష్కరించారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఇలా చేశారన్న విమర్శలు వస్తున్నాయి. వృథాగా వెళ్లే నీటిలో ఒక టీఎంసీని చెరువుకు తరలించేందుకు మాత్రమే జీవో ఇచ్చారని జనవరుల శాఖ అధికారులు అంటుండటం విస్మయం కలిగిస్తోంది. ఇన్నాళ్లు 'జీవో తెచ్చాం.. నీరు తెచ్చాం..' అని అధికార పార్టీవారు చేసిన హడావుడి ఉత్తుత్తిదేనా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకులపై ఉంది.

పార్టీ కోసం పనిచేయండి..!



అనంతపురం రూరల్, మార్చి 16: వలంటీర్లందరూ వైసీపీ కోసం పనిచేయాలని అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సూచించారు. రుద్రంపేట సమీపంలో, హైదరాబాదు-బెంగళూరు హైవేకు ఆనుకుని ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గంలోని పలు మండలాల వలంటర్లకు ఆయన ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారని తెలిసింది. 'ఏం భయంలేదు. ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా పాల్గొనండి. అవసరమైతే వలంటీర్ పోస్టులకు రాజీనామా చేయండి. గెలవగానే మళ్లీ తీసుకుంటాం..' అని ఆయన భరోసా ఇచ్చారని తెలిసింది. అలా కాకపోతే, సమస్యలు వస్తాయని భయం ఉంటే.. పరోక్షంగానైనా పనిచేయాలని కోరినట్లు సమాచారం. ఈ వ్యవహారం నియోజకవర్గంలో చర్చనీయాంశం అయ్యింది. సమావేశానికి వచ్చిన ఒక్కో వలంటీరుకు రూ.5 వేలు ఇచ్చి పంపించారని ప్రచారం జరుగుతోంది. సమావేశంలో మాట్లాడే అంశాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు.. ఫోన్‌లను బయటే పెట్టిరావాలని వలంటీర్లకు అధికార పార్టీ నాయకులు సూచించినట్లు తెలిసింది. ఎన్నికల ప్రచారాలకు, రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వలంటీర్లకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అయినా, ఎన్నికల్లో వలంటీర్లను వాడుకోవాలని అధికార పార్టీ వ్యూహం పన్నుతోంది.

ఉష్ణోగ్రతలు (శని)
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0

ఎలెచ్చన్ల కోడి..!

లెక్క భద్రమప్పో..!



"న్యాలినెక్కా.. ఎండలు సెడ కాత్తాండాయి. నీల్లు ఎన్నితాగినా దప్పిగ తీరదు. కడుపు ఉబ్బుతాది.. గొంతు ఆరకొత్తాంది. బువ్వ ముద్ద నోట్లోకి పెట్టుకున్నా దిగపడదు పుల్లన్న మామా.." సింత సెట్టుకింద బండమింద కూలబడుకుంట అంటాండాడు పక్కీరిగాడు.

"ఉత్త బువ్వ ఏంటికి దిగుతాది వై నీకీ.. కూలి పనులు, ఉపాధి పనులు.. రెండుపక్కల సంపాయిత్తాండావు.. నాటుకోల్లు సుమారుగ పెంచినావుగదా.. ఒగదాన్ని తెగ్గొట్టగుడదా..?" అన్నాడు పుల్లన్న..!

ఇద్దరూ జతగాళ్లు. పైటాల బువ్వ తిన్నెంక.. తీరిక దొరికినప్పుడల్లా సెట్టుకింద సేరి సుద్దులు మొదలు పెడతారు. ఇప్పుడూ అట్లనే కలుసుకుండారు..

"నేను ఎండల గురించి అంటే నువ్వు కోళ్ల గురించి అంటావేంది మామా..? టీవీలో గుడక ఏందో ఎలచ్చన్ల కోడి గురించి మాట్లాడతాండారు.. అది ఒచ్చిందంట గదా.. జేబిలో దుడ్లు కనపడితే పోలీసోళ్లు గుంజకపోతారంట గదా మామా..?"

"అది ఎలచ్చన్ల కోడి కాదువై నీయక్కా..! కోడు.. కోడు అంటారు దాన్ని. ఓట్లని కొనేదానికి దుడ్లు పంచకుండా పోలీసోల్లు ఒగ కన్నేసి పెడతారు. ఎవురిదెగ్గరన్నా లెక్కాసారం లేని దుడ్లు కనిపిస్తే గుంజకపోతారు. నీలెక్క దుడ్లుండేటోళ్లు రోంత బద్దరంగ ఉండల్ల ఈ రొన్నాళ్లు.." జాంతనం ఆడుతాండాడు పుల్లన్న.

"ఈడిసి కొడితే పది రూపాయలు లేవు నా కాడ. అయినా పబ్బులీకుగా దుడ్లు పంచుతారుగదా మామా..? ఓటుకు ఐదు నూర్లు.. ఎయ్యి రూపాయిలు..! పింఛనీ దుడ్లు ఇచ్చినట్ల ఇచ్చిపోతారు ఎలచ్చన్లొత్తే..! యా పోలీసోల్లు పట్టుకుంటాండారు..?" పక్కీరిగానికి డౌటొచ్చింది..!

"అట్ల పంచే దుడ్లు యాదీ పట్టుకోరు. ఎవరికి చేరాల్సిన లెక్క వాళ్లకి సేరుతుందిలేగానీ.. మనట్లా సేద్యగాళ్లు, కూలోళ్లు యాపారుల దెగ్గిర అప్పో సప్పో తీసుకోని వత్తాంటాం సూడీ.. అట్లాంటివి పట్టుకుంటారు. పోయిన ఎలచ్చన్లప్పుడు పాపం మనూరి రామిరెడ్డి, తిప్పన్నగాడు అరిటికాయిలు అమ్మిండే దుడ్లు తెస్తాంటే పట్టుకోంద్రి కదా.." గుర్తు సేసె పుల్లన్న.

"ఊను మామో.. పాపం పంట అమ్మిండే దుడ్లు అన్యాగుడక ఇనుకోలేదు. ఐదారు లచ్చలు గుంజకపోయి ఇంకం ట్యాక్సు వాళ్లకి ఇచ్చినారుగదా..! మళ్లీ తెచ్చుకుండేకి ఎంత తిప్పలు పడిరో మామా..! ఆ లెక్క ఇంగ పోయినట్లే అనుకుంటిమి.. ఎట్లోగట్ల ఎనిక్కి ఇచ్చిరి.." నిట్టూర్చె పక్కీరిగాడు.

"అందికే లెక్క ఎంబడీత తీసకపోగుడదు. ఒగ్యాల తప్పదనుకుంటే ఆ లెక్క యాట్నుంచి తెచ్చుకోండేదీ ఆధారాలు సూపియ్యల్ల. బిల్లులో గిల్లులో.. బ్యాంకు సీటీలో.. యావో ఒగటి..! ల్యాకుంటే తిప్పలు తప్పవు.." అనె పుల్లన్న.

"న్యాలి నెక్కా.. కోట్లు కోట్లు సూటికేసుల్లో తీసకపోతే పట్టుకోరుగాని, ఆసిపత్తిరికో, సేద్యానికో సెయ్యి బదులు తీసుకొచ్చుకుండే దుడ్లని పట్టుకుంటారు. మనిసిని సూత్తే గుర్తుపట్టలేరా..? ఈడు ఎలెచ్చన్ల లెక్క తీసకపోతాండాడా..? సేద్యం సేసే రైతా..? అనేది. రోంత గుడక కనికరం లేకుండా గుంజకపోతారు.. ఏం పోలీసోల్లో ఏమో మామా.." పక్కీరిగాడు రోంత కోపంగా అంటాండాడు..!

"వాళ్ల రూల్సు వాళ్లకి ఉంటాయప్పా..! పెద్దోళ్లకయితే లింకులు ఉంటాయి. ఒగ ఫోను కొడితే ఇడిసిపెడతారు. మనట్లాటోళ్లకి వాళ్లని సూత్తానే కాళ్లు ఒనుకుతాయి. నోట్ల మాట పెగలదు. దొరికినాడురా నాయాలు.. అని లెక్క పీక్కుంటారు. అందుకే.. మనమే బద్దరంగ ఉండల్ల..! కోడు అంటే మాటలు కాదు..!" ఎచ్చరించె పుల్లన్న.

"సర్లే మామా.. ఈ పొద్దు శనివారం. ఎలెచ్చన్ల కోడి కూసింది. రేపు ఆదివారం. మా ఇంట్లో కోడి కుయ్యగానే కోసి కురాకు ఒండమంటాను నీ బిడ్డని. రా.. తినిపోదువు..!"



ఇంటిదావ పట్టె పక్కీరిగాడు..!

– అనంతపురం క్రైం

సంక్షోభంలో మైనార్టీలు

5 ఏళ్లుగా అందని సంక్షేమ పథకాలు





మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం

- సబ్సిడీ రుణాలు ఎత్తేసిన వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ పాలనలోనే ఆయా వర్గాలకు లబ్ధి
- సీఎం జగన్ మోసంపై మైనార్టీ వర్గాల గుర్రు

వైసీపీ పాలనలో ముస్లింలు, ఇతర మైనార్టీ వర్గాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత టీడీపీ పాలనలో అమలు పరిచిన సంక్షేమ పథకాలను సైతం రద్దు చేసి ఇబ్బందులు పాల్జేశారని వైసీపీపై ఆయా వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తెలుగుదేశం పాలనలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసింది. వేల మందికి రూ. 27 కోట్ల దాకా రుణాలను మంజూరు చేసింది. ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ తీసుకునే అభ్యర్థులకు ఫీజు రూపంలో రూ. ఆరు కోట్ల వరకూ రుణాలు అందించింది. అదే విధంగా ట్రైనింగ్ అండ్ ఫైనాన్స్ టు లా గ్రాడ్యుయేట్స్ స్కీం కింద లా కోర్సులు చేసే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. లక్ష వరకూ ఫీజు మంజూరు చేసింది. ఇలాంటి పథకాలు వైసీపీ పాలనలో అటకెక్కాయాని ఆయా వర్గాలు మండిపడుతున్నాయి.

– అనంతపురం ప్రెస్‌క్లబ్

మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో పథకాల లబ్ధి ఇలా...

టీడీపీ పాలనలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు 50 శాతం సబ్సిడీతో రుణాలను అందించింది. 2014-15 సంవత్సరంలో 457 మంది ముస్లింలకు రూ.2.59 కోట్లు, 23 మంది క్రిస్టియన్ లబ్ధిదారులకు రూ. 11.20 లక్షలు, 2015-16లో రూ. 1931 మంది ముస్లింలకు రూ. 4.91 కోట్లు, 73 మంది క్రిస్టియన్ లబ్ధిదారులకు రూ.36.40 లక్షలు, 2016-17 సంవత్సరంలో 1076 మంది ముస్లింలకు రూ.5.44 కోట్లు, 30 మంది క్రిస్టియన్ లబ్ధిదారులకు రూ. 23.75 లక్షలు, 2017-18 సంవత్సరంలో 1619 మంది ముస్లింలకు రూ.12.15 కోట్లు, 54 మంది క్రిస్టియన్ లబ్ధిదారులకు రూ. 49.20 లక్షలు, 2018-19లో 139 మంది ముస్లింలకు రూ. 1.19 కోట్లు, 19 మంది క్రిస్టియన్ లబ్ధిదారులకు రూ. 17 లక్షల రుణాలను అందించింది.

ముస్లింలను నట్టేట ముంచాడు

ముస్లిం వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామంటూనే సీఎం జగన్మోహన్‌రెడ్డి వారిని నట్టేట ముంచేశాడు. నిధులివ్వకుండా మైనార్టీ వెల్ఫేర్, కార్పొరేషన్లను నిర్వీర్యం చేశాడు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సబ్సిడీ లోన్లు, ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ తీసుకునే వారికి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేశారు. వాటిని వైసీపీ ప్రభుత్వం ఎత్తేసి ఎంతో మంది ముస్లింల ఉపాధి మార్గాలకు గండి కొట్టింది. ట్రైనింగ్ అండ్ ఫైనాన్స్ టు లా గ్రాడ్యుయేషన్ స్కీం కింద ఫీజుల రూపంలో ఇచ్చే భృతిని ఎత్తేసి ముస్లిం విద్యార్థులకు అన్యాయం చేశారు. దుల్హన్ పథకం ద్వారా గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 36 వేల మందికి లబ్ధిని చేకూరిస్తే వైసీపీ ప్రభుత్వం 10వ తరగతి సర్టిఫికెట్ లింకులు పెట్టి ఐదేళ్లలో మూడు వేల మందికి కూడా పథకాన్ని వర్తింపజేయలేదు. రంజాన్ మాసంలో మసీదుల మరమ్మతులకు గతంలో రూ. కోట్లు విడుదల చేస్తే... సీఎం జగన్ కనీసం మసీదులకు సున్నం కొట్టేందుకు కూడా నిధులు కేటాయించలేదు. షాదీఖానాలకు బడ్జెట్ ఇవ్వలేదు. రంజాన్ మాసంలో అందించే రంజాన్ తోఫా, విదేశీ విద్య, హజ్ యాత్రకు సబ్సిడీ లేకుండా చేశారు.



– గౌస్‌మొద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

క్రైస్తవులకు పంగనామం



క్రైస్తవులకు గత తెలుగుదేశం ప్రభుత్వం 11 సంక్షేమపథకాలు అమలు చేస్తే సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం పంగనామాలు పెట్టాడు. ఒక్క పథకం కూడా అమలు పరచకుండా క్రైస్తవులను నట్టేట ముంచాడు. క్రైస్తవ ఓట్లతో గెలిచి వారికే పంగనామం పెట్టిన ఘనత జగన్‌కే దక్కింది. ప్రస్తుతం తన మేనత్తను ఓట్ల కోసం రాష్ట్రమంత తిప్పుతున్నాడు. క్రైస్తవులందరూ తమకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి సీఎం మోసపూరిత మాటలను తిప్పికొట్టాలి. జెరుసలేం యాత్రను రద్దు చేసి క్రైస్తవులను మోసం చేశాడు. గత తెలుగుదేశం ప్రభుత్వం 277 చర్చి నిర్మాణాలకు రూ. 45 కోట్లు విడుదల చేస్తే... ఈ ప్రభుత్వం ఒక్క చర్చి నిర్మాణానికి నిధులివ్వలేదంటే... క్రైస్తవుల పట్ల సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది.

– ఈటె స్వామిదాస్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ

అటకెక్కిన ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ స్కీం..

ముస్లిం, ఇతర మైనార్టీలకు సంబంధించి విద్యార్థులు, మహిళలకు ఉపాధి మార్గాలు చూపాలనే ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వం ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ స్కీంలను అమలు పరిచింది. ఈ పథకం ద్వారా టైలరింగ్, కంప్యూటర్ శిక్షణకు ఫీజులు చెల్లించేందుకు అభ్యర్థులకు రుణాలు మంజూరు చేసింది. 2015-16లో 147 మంది ముస్లింలకు రూ. 20.86 లక్షలు, 210 మంది క్రిస్టియన్ లబ్ధిదారులకు రూ. 12.60 లక్షలు, 2016-17లో 1660 మంది ముస్లింలకు రూ.2.10 కోట్లు, 2017-18లో 1361 మంది ముస్లింలకు రూ.1.67 కోట్లు, 60 మంది క్రిస్టియన్లకు రూ.6.60 లక్షలు, 2018-19లో 2250 మంది ముస్లింలకు రూ. 2.68 కోట్లు, 60 మంది క్రిస్టియన్లకు రూ. 6.60 లక్షలు అందించింది.

పత్తాలేని లా గ్రాడ్యుయేషన్ పథకం...

కరువు జిల్లాలో ఎంతో మంది ముస్లిం, ఇతర మైనార్టీ వర్గాల ఉన్నత చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు తొలగించడానికి ట్రైనింగ్ అండ్ ఫైనాన్స్ టు లా గ్రాడ్యుయేట్స్ స్కీంను తీసుకొచ్చారు. ఈ పథకం కింద న్యాయవాద కోర్సుల శిక్షణకు సంబంధించి శిక్షణ ఇచ్చే లాయర్లకు ఫీజులను ప్రభుత్వమే భరించింది. అందుకోసం 2015-16లో ఇద్దరు ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చే లాయర్‌కు ఫీజు రూపంలో రూ. 97వేలు, ఒక క్రిస్టియన్ విద్యార్థికి సంబంధించి రూ.49 వేలు అందించింది. 2016-17లో ఐదుగురు ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.2.43 లక్షలు, ఒక క్రిస్టియన్ విద్యార్థికి రూ. 49 వేలు, 2017-18లో ఐదుగురు ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.2.43 లక్షలు, ఒక క్రిస్టియన్ విద్యార్థికి రూ. 49 వేలు అందించింది.

సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి

ఇంటింటికీ ప్రచారంలో ఎల్ నారాయణచౌదరి



బసంపల్లిలో ప్రచారం చేస్తున్న ఎల్ నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, మార్చి 16: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధిచేకూరుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి పేర్కొన్నారు. మండలంలోని బసంపల్లి గ్రామంలో శనివారం ఆయన ఇంటింటికీ తిరిగి మినీమేనిఫెస్టోలోని అంశాలను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, జనసేన కన్వీనర్ ఇటికోటి క్రాంతికుమార్, టీడీపీ మండల ప్రధానకార్యదర్శిముత్యాలప్ప, నాయకులు రామసుబ్బమ్మ, అంకే అమరేంద్ర, ఎజ్జేశంకర్, బసంపల్లి బయన్న, చంద్రాయుడు, రామకృష్ణారెడ్డి, ఈడిగ భార్గవగౌడ్, ఒంటికొండ రమేశ్, పణీంద్ర, రమణ, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి రాజధాని



చాపట్ల గ్రామస్థులతో ధర్మవరపు మురళి, టీడీపీ నాయకులు

రాప్తాడు, మార్చి 16: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి రాజధాని ఏర్పాటవుతుందని రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి అన్నారు. మరూరు గ్రామపంచాయతీ పరిధిలోని చాపట్ల గ్రామంలో శనివారం భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు రావాలంటే బాబు అధికారంలోకి రావాలన్నారు. రాప్తాడులో పరిటాల సునీతకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, సర్పంచ్‌లు తిరుపాలు, మరూరు గోపాల్, ఇంద్ర, సాకే జయరాముడు, హంపాపురం జయప్ప, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీరన్న, మరూరు కదిరయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరూరులో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, మార్చి 16: టీడీపీతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పేరూరు గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అభివృద్ధి కావాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, పరంధామయాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు, మాదాపురంశంకర, వడ్డిసుబ్బు, నాగరాజు, చిత్తరంజన్, శివకుమార్, సురేశ్, గుర్రంశీన, పేపర్‌శీన, క్రాంతి, తిరుపాలప్ప పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



బద్దలాపురంలో టీడీపీ నాయకుల ప్రచారం

ధర్మవరంరూరల్, మార్చి 16: బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు అని టీడీపీ నాయకులు అన్నారు. కనగానపల్లి మండలంలోని బద్దలాపురం గ్రామంలో శనివారం వారు సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెంవెంకటేష్, మండలకన్వీనర్ యాతంపోతలయ్య, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి, బోదులస్వాతి, గిరిశాల అరుణ, స్రవంతి, ధనలక్ష్మీ, అనిత, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పథకాల అమలు



తలుపూరులో గ్రామస్థులతో బాలాజీ, నాయకులు

ఆత్మకూరు మార్చి 16: టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతాయని మండల ఇన్‌చార్జి బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని తలుపూరు గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. పరిటాల సునీతను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురాం, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, మాజీ జడ్పీటీసీ కుళ్లాయప్ప, మాజీ కన్వీనర్లు క్రిష్ణమోహన్ చౌదరి, మనోరంజన్, వేణుగోపాల్, సూరి, వెంకటనారాయణ, నాయకులు విశ్వనాథరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

వివాహానికి దండు ఆర్థిక సాయం

శింగనమల, మార్చి16: మండలంలోని ఆనందరావుపేట గ్రామానికి చెందిన జయరాం కుమారుడు హనుమంతు వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండిపరుశురాం, అనిల్, అమర్‌నాథ్, కాయలసురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక పరిశోధనలు చేయాలి

- జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు



ఉద్యోగులతో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, మార్చి 16: సమస్యల పరిష్కారానికి ఆచరణాత్మక పరిశోధనలు చేయాలని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. శనివారం జేఎన్‌టీయూలో పరిశోధనలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్డీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. ఎంచుకున్న అంశాన్ని వివిధ కోణాల్లో అభ్యసించాలన్నారు. తద్వారా విలువైన పరిష్కారాన్ని చూపవచ్చునన్నారు. ప్రతి విభాగానికి కమిటీలను ఏర్పాటుచేసి సలహాలు, సూచనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఆర్డీ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విభాగాధిపతులు మమత, కళ్యాణిరాధ, రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషి కీలకం..

వర్సిటీ అభివృద్ధిలో ఆప్కాస్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల కృషి కీలకమని వీసీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆప్కాస్ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్నేహపూర్వక వాతావరణంలో పనిచేయాలని సూచించారు. అనంతరం వీసీని ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, ఆప్కాస్ ఉద్యోగులు శిరీష్‌రెడ్డి, వెంకటరాముడు, రహంతుల్లా, క్రిష్ణయ్య, మధుసూదనరెడ్డి, రవిశంకర్, శశికల, లక్ష్మీదేవి, ప్రభాకర్ నాయక్, సరస్వతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను జయప్రదం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి



మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 16: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఆదివారం జరిగే ప్రజాగళం సభకు అనంత అర్బన్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శనివారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో పలువురు ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ప్రజాగళం సభను నిర్వహించడం జరుగుతోందన్నారు. సభకు ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారన్నారు. శనివారం ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదలైందని, ప్రజాగళం సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై ఎన్నికల సమరానికి సమర శంఖం పూరిద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవళ్ల మురళీ, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, నటేష్ చౌదరి, నారాయణస్వామి యాదవ్, డిస్కో బాబు, గుర్రం నాగభూషణం, రాజారావు, గోపాల్ గౌడ్, వన్నూరప్ప, మార్కెట్ మహేష్, బోయపాటి బాలప్ప, చంద్ర, జేఎం బాషా, సాకే వెంకటేష్, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, కృష్ణవేణి, కంఠాదేవి, రాధ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు... శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



కేశవాపురంలో ఓటు అభ్యర్థిస్తున్న బండారు శ్రావణిశ్రీ

గార్లదిన్నె, మార్చి 16: ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహరెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, అన్నివిధాలా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. శనివారం మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో ముత్యాలమ్మ స్వామి దేవాలయం ప్రారంభోత్సవానికి నియోజకవర్గం పరిశీలకుడు గుర్రప్పనాయుడు, ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డితో కలసి ఆమె హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను వివరించారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టాడన్నారు. కేశవరెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శ్రమించి బండారు శ్రావణి శ్రీని గెలిపించాలన్నారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లూరు రామాంజి, మాజీ సర్పంచులు సువర్ణమ్మ, పుల్లన్న, శ్రీరాములు, అంజినేయులు, ఆవులశీనా, గోరకాటి వెంకటేసు, జయరాం, బాబయ్య, జగదీష్, ఎంపీటీసీ విశ్వనాథ్, ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, సంగప్ప, గుత్తాహరి, రామచంద్ర, కొడిదల శీనా, రామాకృష్ణ, చింతా వెంకట్రాముడు, వెంకటేసు, సామాల మధు, రాము తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండలంలోని నాయనపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో బండారు శ్రావణిశ్రీ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు ఉన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి మరుగున పడి పోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, వెంకటేశ్వరనాయుడు, మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, రాజుగౌడ్, జాఫర్, రాజన్న, జనసేన రామకృష్ణ, నాగేంద్ర, నాగేష్, రామకృష్ణ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రస్వామి జన్మతిథి



స్వామివారికి పూజలు చేస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్, మార్చి 16 మంత్రాలయ రాఘవేంద్రస్వామి జన్మతిథిని పురస్కరించుకుని శనివారం నగరంలో మొదటిరోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠంలో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి బృందావనానికి ఫలపంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అష్టాక్షరహోమం, గురుదోషనివారణ, అపమృత్యు పరిహారం, ఇష్టార్థసిద్ధి పూజలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో ఆలయ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఓం సంగీత నృత్య కోలాట బృందం

సార్వత్రిక ఎన్నికల సమావేశానికి హాజరు



హాజరైన నాయకులు

అనంతపుం అర్బన్ మార్చి 16: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో 2024 సార్వత్రిక ఎన్నికల సమ్మిట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన టీడీపీ లీగల్ సెల్ నాయకుడు గాజుల అదెన్న లేపాక్షి నాయుడు, మురళీకృష్ణ, తిరుపాలు నాయుడు, నాగలింగం మహేశ్, విజయ్‌కుమార్, ప్రసాద్, లక్ష్మన్న, టీడీపీ నాయకుడు జకీవుల్లా, రాయల్ మురళీమోహన్, మూర్తిమోహన్ తదితరులు హాజరయ్యారు. టీడీపీ కార్యకర్తలు వైసీపీ పెట్టిన అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేసిన లీగల్ నాయకులకు చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ జనసేన బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

బొమ్మనహాళ్, మార్చి 16: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదాన చేశారు. ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

'స్టార్టప్‌లతో ఉత్పాదక రంగ అభివృద్ధి'

అనంతపురం సెంట్రల్, మార్చి 16: నూతన స్టార్టప్‌లను నెలకొల్పితే ఉత్పాదక రంగం అభివృద్ధి సాధిస్తుందని సేవాభారతి ట్రస్ట్ ప్రతినిధి జగదీశ్వర్ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు స్టార్టప్‌లపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జగదీశ్వర్ ప్రసాద్, కళాశాల ఆర్థికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రామచంద్ర, తత్వశాస్త్ర అధ్యాపకులు జూటూరు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక పరమైన సహాయ సహకారాలందిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. తద్వారా మేడ్ ఇన్ ఇండియా, మేడ్‌ఫర్ ఇండియాలో భాగస్వాములు అవుతారన్నారు. కార్యక్రమంలో సేవాభారతి ట్రస్ట్ ముత్యాలు, అధ్యాపకులు బాలాజీనాయక్, లక్ష్మి, చలపతి, తిరుమలేష్ పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

చెన్నేకొత్తపల్లి, మార్చి 16: చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి మహర్షి మందిరనిర్మాణం, విగ్రహ ఏర్పాటుకు ప్రొఫెసర్ రాజేష్ రూ.3లక్షలు విరాళంగా అందజేశారు. అనంతపురంలోని ఆయన స్వగృహంలో శనివారం సంబంధిత చెక్కును మండల వాల్మీకి సోదరులకు ఇచ్చారు.



చెక్కును అందజేస్తున్న ప్రొఫెసర్ రాజేష్

అమరజీవికి ఆర్యవైశ్యుల నివాళి



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, మార్చి 16: అమరజీవి పొట్టిశ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. శనివారం జిల్లాకేంద్రంలో పొట్టిశ్రీరాములు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కలవల సతీష్, టంగుటూరి నాగభూషణ, జయంతి శ్రీనివాసులు శెట్టి, సత్రసాల మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన అదృశ్యమైన విద్యార్థి

గార్లదిన్నె, మార్చి 16: ఐదునెలల అనంతరం తల్లిదండ్రుల చెంతకు కుమారుడు చేరాడు. గార్లదిన్నెకు చెందిన గట్టు వెంకట్రామిరెడ్డి, వర్ణ దంపతుల కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఐదు నెలల క్రితం పండుగకువచ్చిన ఆ విద్యార్థి తిరిగి కళాశాలకు వెళుతున్నానని రైలు ఎక్కాడు. అయితే అతను కళాశాలకు రాలేదని యాజమాన్యం తల్లిదండ్రులకు తెలుపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ విద్యార్థి ఒంగోలు జిల్లా కంభం మండలం తర్లపాడు గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్, కానిస్టేబుల్ వెంకటేశు వెళ్లి ఆ విద్యార్థిని శనివారం గార్లదిన్నెకు తీసుకువచ్చారు. విచారించగా తనకు చదువు కోవడం ఇష్టంలేదని, అందుకే పారిపోయినట్లు ఎస్ఐ గౌస్‌బాషా ముందు తెలిపాడు.

'ఎన్నికల నిబంధనలు పాటించాలి'

రాప్తాడు, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాప్తాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు.

'పది' పరీక్షలకు మూడు కేంద్రాలు

నార్పల, మార్చి 16: మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలకు మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. శనివారం చీఫ్ సూపర్‌వైజర్లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర, ప్రభుత్వ బాలికల, సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.25వేలు

అనంతపురం రూరల్, మార్చి 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 559టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆస్పత్రికి నెబులైజర్ల వితరణ



పరికరాలు అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం టౌన్, మార్చి 16: జిల్లా సర్వజన ఆస్పత్రికి అమ్మస్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రమణారెడ్డి శనివారం దాదాపు రూ70వేలు విలువ చేసే నెబులైజర్స్ ఆక్సిజన్ మాస్క్‌లను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

రాప్తాడులో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రాప్తాడు, మార్చి 16: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి, చిన్మయ్‌నగర్, హంపాపురంలో కేంద్ర రక్షణ బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర రక్షణ బలగాలతో కవాతు నిర్వహించామని బీఎస్ఎఫ్ అధికారి ధర్మేంద్ర సింగ్, సీఐ మునిస్వామి తెలిపారు.

విద్యార్థులకు డీఐజీ అభినందన



విద్యార్థులతో డీఐజీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 16: సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులను డీఐజీ అమ్మిరెడ్డి అభినందించారు. శనివారం డీఐజీని ఆయన చాంబర్‌లో సైనిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయబృందం కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ అమ్మిరెడ్డి విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం



- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- గుర్తింపు కార్డు తప్పనిసరి
- దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు : కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 16: ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహిస్తున్న గ్రూప్-1 స్ర్కీనింగ్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టరు గౌతమి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆమె కలెక్టరేట్‌లో వెల్లడించారు. జిల్లాలో 11,597మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. వీరి కోసం 33 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండు పూటలా పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఒక్కనిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించమన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షాహాల్‌లోకి తీసుకురాకూడదని సూచించారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు ప్రభుత్వంచే జారీచేయబడిన ఏదైన గుర్తింపుకార్డు తీసుకొని రావాలన్నారు. దివ్యాంగులు మొదటి ఫ్లోర్‌లోనే పరీక్ష రాయడానికి ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సందేహాలు ఉంటే 08554- 220009 నెంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 33 మంది సీనియర్ అధికారులను లైజన్ ఆఫీసర్లుగా నియమించామని. అందరూ సమన్వయంతో పనిచేసి గ్రూప్-1 పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- పేపర్‌లీక్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు: కలెక్టర్

అనంతపురం టౌన్. మార్చి 16 : పదోతరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. జిల్లాలో ఈఏడాది 40,063మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈనెల 18నుంచి పరీక్షలు మొదలవుతాయని ఉదయం 9-30 గంటలనుంచి మధ్యాహ్నం 12-45 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8-40గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి ప్రశ్నా పత్రానికి ఒక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షల్లో పేపర్‌లీక్. మాల్‌ప్రాక్టీస్ జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షాకేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. వేసవి నేపథ్యంలో కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచామని. ప్రత్యేకంగా మెడికల్‌క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అన్నికేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ చూపితే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టరు సూచించారు.

నగుబాటు పనులు

- గత ప్రభుత్వం ప్రారంభించిన పనులపై వైసీపీ సర్కార్ శీతకన్ను

- తాడిపత్రిలో అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
- ప్రారంభం కాకమునుపే నెర్రెలు చీలుతున్న గోడలు
- ఆయా నిర్మాణాల వద్ద పెరుగుతున్న పిచ్చి మొక్కలు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు, పాలకులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో నిర్మాణాలు పూర్తికాకమునుపే గోడలు నెర్రెలు చీలుతున్నాయి. బండ్ల పరుపు దెబ్బతింటున్నాయి. పట్టణంలోని శ్రీనివాసపురంలో పశువుల ఆసుపత్రితోపాటు ల్యాబ్ నిర్మాణానికి దాదాపు రూ.80లక్షలు నిధులు మంజూరయ్యాయి. నిధులు మొత్తం ఖర్చుచేసి నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి ఇంకా రూ.20లక్షల మేర నిధులు కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నూతన భవనం శిథిలావస్థకు చేరుకుంది. అలాగే గత టీడీపీ పాలనలో యువతకు క్రీడల్లో నైపుణ్యం పెంచాలన్న ఉద్దేశంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.2 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు గోడలకే పరిమితమయ్యాయి. ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ నిర్మాణం ఆగిపోయింది. చిన్న బజారులోని పాతకూరగాయల మార్కెట్ సమీపంలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయిం ది. ఆ స్థలంలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. శ్రీనివాసపురం సమీపంలో పెన్నానది ఒడ్డున కేజీబీవీ నిర్మాణం కోసం రూ.1.5కోట్లు ఖర్చుచేయగా మిగిలిన నిర్మాణ పనుల కోసం అదనంగా మరో రూ.2 కోట్లు కావాల్సి ఉంది. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నదిలో నిర్మాణం చేపట్టడంతో సేఫ్టీవాల్ కోసం కావాల్సిన నిధులను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పాతకోటలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిధుల లేమితో మధ్యలోనే ఆగిపోయింది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిపై పాలకులు దృష్టిపెడితే బాగుంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రి భవనం





గోడలు నెర్రెలు చీలిన దృశ్యం



నిలిచిపోయిన షాదీఖానా పనులు



మొండిగోడలతో దర్శనమిస్తున్న ఇండోర్ స్టేడియం



దెబ్బతిన్న బండ్ల పరుపు

రూ.5 కోట్ల ప్రజాధనం వృథా

ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్న తలంపుతో గత టీడీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాల కోసం విడుదల చేసిన రూ.5కోట్లు వృథాగా మారాయి. 2019ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ గత టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన నిర్మాణాలపై శీతకన్నువేసింది. నిధులు తక్కువగా ఉన్న వాటికి అదనపు నిధులు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఇలా ఏళ్లు గడుస్తుండటంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో రూ. కోట్ల ప్రజాధనం వృథాగా మారింది. అధికారులు, పాలకులు తగు చొరవ చూపి భవనాల నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఆద్యంతం..అద్భుతం..!

- గవర్నర్ ముందు ఆద్యలక్ష్మి నృత్యప్రదర్శన
- ప్రశంసలందుకున్న అనంత చిన్నారి

అనంతపురం కల్చరల్, మార్చి 16 : మూడేళ్ల చిన్నారి..ముద్దుముద్దుగా అడుగులేసే వయస్సులో.. అద్భుతంగా నాట్యప్రదర్శన చేసి గవర్నర్‌తో ప్రశంసలు అందుకుంది. అనంతపురం నగరానికి చెందిన మూడున్నర సంవత్సరాల చిన్నారి ఆద్యలక్ష్మి రాష్ట్ర గవర్నర్ ముందు నృత్య ప్రదర్శననిచ్చింది. చిన్నారి ఆద్యలక్ష్మి మూడేళ్లకే సంప్రదాయ భరతనాట్యంలో మెలకువలు నేర్చుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకలోనూ మైమరిపించే ప్రదర్శనతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది. విషయం తెలుసుకున్న గవర్నర్ శనివారం రాజ్ భవన్‌కు చిన్నారి ఆద్యలక్ష్మిని పిలిపించుకోగా గవర్నర్ సమక్షంలో అద్భుతంగా నృత్య ప్రదర్శననిచ్చింది. మురిసిపోయిన గవర్నర్, చిన్నారిని ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించడంతోపాటు ప్రభుత్వపరంగా తనవంతు సహాయ సహకారాలందిస్తానని హామీ ఇచ్చారు. 'తానా' సభల్లో నృత్యప్రదర్శనిచ్చేలా సిఫారసు చేస్తానన్నారు.



చిన్నారిని ప్రశంసిస్తున్న గవర్నర్



గవర్నర్ ముందు నృత్యప్రదర్శన ఇస్తున్న ఆద్యలక్ష్మి

కఠోర శ్రమకు నిదర్శనం మాకం

- ఆదర్శంగా తీసుకోవాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి

హిందూపురం, మార్చి 16 : ఎంతో కఠోర శ్రమ చేస్తే తప్ప ఫలితం దక్కదని, అందుకు ఉదాహరణ మాకం శ్రీధర్ అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి అన్నారు. హిందూపురానికి చెందిన మాకం శ్రీధర్ కర్ణాటక తరపున పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనకు శనివారం ఎస్‌డీజీఎస్ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల పూర్వ విద్యార్థి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ.... ఏదైనా ఫలితం రావాలంటే కఠోర శ్రమ చేయాలన్నారు. హిందూపురానికి చెందిన మాకం శ్రీధర్ చిన్ననాటి నుంచి జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యంతో కష్టపడటం వల్లే పద్మశ్రీకి ఎంపికయ్యారని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం జన్మించిన వారిలో పద్మశ్రీకి ఎంపికైన ఉమ్మడిజిల్లాకు చెందిన మొదటి వ్యక్తి మాకం శ్రీధర్ అన్నా రు. ఆయన కర్ణాటకలో విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఇప్పటికీ ఏదో సాధించాలన్న దృఢసంకల్పంతో వెళ్తున్న ఆయనను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాకం శ్రీధర్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే తాను ఈ అవార్డుకు ఎంపికయ్యానన్నారు. తాను మైసూరు విద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందుకున్నానని, విజయ కళాశాల కామర్స్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేశానన్నారు. సాహిత్యం, విద్యారంగంలో తాను చేసిన సేవను గుర్తించి పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. పలువురు వక్తలు శ్రీధర్ జీవిత చరిత్రను తెలియజేశారు. అనంతరం మాకం శ్రీధర్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీజీఎస్ కళాశాల అధ్యక్షుడు రేపూరి చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, ఉపాధ్యక్షులు దాసా సందీప్, గంగాధర్, నందకిశోర్, ప్రిన్సిపాల్ ప్రసాద్, నాగేంద్ర, ప్రొఫెసర్ నరహరి, పార్థసారథి, జేపీకే రాము, బీఎస్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి

గేట్‌లో 359 ర్యాంక్



శ్రీచరణ్

అనంతపురం సెంట్రల్, మార్చి 16: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇంజనీరింగ్(గేట్-2024)లో అనంత విద్యార్థి శ్రీచరణ్ జాతీయ స్థాయిలో 359 ర్యాంక్ సాధించాడు. నగరానికి చెందిన పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) డాక్టర్ రత్నకుమార్, రాధాదేవి దంపతుల కుమారుడు శ్రీచరణ్ ఎన్ఐటీ సూరత్కల్‌లో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు శిక్షణ ఇస్తూనే తాను 359 ర్యాంక్ సాధించడం గమనార్హం. కృత్రిమ మేధస్సు(ఏఐ) వంటి రంగాల్లో ఉద్యోగాలకు ర్యాంక్ ఉపయోగపడుతుందని శ్రీచరణ్ పేర్కొన్నారు.

తెలుగు వారందరూ కదలిరండి..

- టీడీపీని గెలిపించడం అందరి బాధ్యత
- ఐ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోంపల్లి శ్రీకాంత్ పిలుపు



ఉరవకొండ, మార్చి16: సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి ప్రపంచ నలుమూలలా ఉన్న తెలుగు వారందరూ కదలి రావాలని ఐ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోంపల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారని, పోలింగ్‌కు 55రోజులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఈ ఎన్నికల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరూ కీలకపాత్ర పోషించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనలో ప్రజాస్వామ్య, ప్రభుత్వ వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ పతనావస్థకు చేరుకుందన్నారు. వీటిని సరిదిద్దడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఏపీలో నిరుద్యోగం సమసి పోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. వైసీపీని ఓడించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు.

నెమలి వాహనంపై చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి16: పట్టణంలోని గవిమఠంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూడోరోజు స్వామి వారు నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని మఠం నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నెమలి వాహనంపై కొలువుదీర్చారు. గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్, గవిమఠం సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంటేశులు, రఘు, వీరశైవసంఘం నాయకులు, వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు అడ్డపల్లకి ఉత్సవం

చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అడ్డపల్లకి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. స్థానిక వెలిగొండ రహదారిలో విడిది మఠం నుంచి పీఠాధిపతిని అడ్డపల్లకిపై పట్టణంలోని వీ ధుల గుండా ఊరేగిస్తారు. ఈ ఉత్సవాన్ని వడ్డెర్ల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ.



ఉత్సవాలలో పాల్గొన్న ఉత్తరాధికారి, కమిషనర్

24న రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 16: రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు ఈనెల 24న నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ఇటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. పోస్టర్లను శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి విడుదల చేశారు. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విజేతలు జూన్ 4న భీమవరంలో ఇంటర్నేషనల్ ఫిడే ఓపెన్ రేటింగ్‌చెస్ టోర్నీలో పాల్గొంటారన్నారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, డైరెక్టర్ జగదీష్‌బాబు, కిశోర్‌నాయుడు, గోవిందరాజులు, కోచ్ మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

శింగనమల,మార్చి16: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి బీఎల్ఓ డొక్క కృష్ణకు ఎంపీడీఓ రమణ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి డొక్క కృష్ణ నార్పలలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయు ప్రచారంలో పాల్గొన్నారు. దినపత్రికలు, సోషల్ మీడియాలో ప్రచారం వార్తలు రావడంపై స్పందించిన ఎంపీడీఓ రమణ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

బాడుగ ఈకుండా యాడికిపోతారు ?

- బెళుగుప్పలో సచివాలయం-2కు తాళం
- అద్దె చెల్లించి సామగ్రి తరలించాలని అడ్డగించిన యజమాని



అద్దె ఇవ్వనందున మరోసారి సచివాలయానికి తాళం



అద్దె ఇవ్వాలని వేడుకుంటున్న యజమానురాలు నాగమ్మ

బెళుగుప్ప, మార్చి 16: మండల కేంద్రంలో సచివాలయం-2 నిర్వహిస్తున్న భవనానికి అద్దె చెల్లించకపోవడంతో యజమాని శనివారం తాళం వేశారు. బెళుగుప్పలో సచివాలయం-2 నిర్వహణకు నాగమ్మ అనే మహిళ తన భవనాన్ని అద్దెకు ఇచ్చింది. అద్దె సక్రమంగా చెల్లించక పోవడంతో రూ.1.5 లక్షల బకాయి పేరుకుపోయింది. దీంతో గత నెల 28న భవనానికి తాళం వేశారు. అయితే వారంలోగా చెల్లిస్తామని ఈవోఆర్డీ మాధవరెడ్డి చెప్పడంతో ఒప్పుకుని తాళాలు ఇచ్చారు. 20 రోజులు గడిచినా అద్దె చెల్లించకుండా అదిగో ఇదిగో అంటూ తిప్పుకున్నారు. ప్రస్తుతం అద్దె బకాయి ఇవ్వకుండానే ప్రభుత్వ భవనంలోకి తరలించడానికి అధికారులు ప్రయత్నించారు. తమ బకాయి చెల్లించి సామగ్రి తరలించాలని యజమాని తాళాలు వేసింది. ఈ విషయమై ఈవోఆర్డీ మాధవరెడ్డి మాట్లాడుతూ మార్చి నెలలో డిజిటల్‌కీ రెన్యువల్ చేయించాలని, అందువల్లే సమస్య నెలకొందన్నారు. డబ్బు ఇవ్వలేకున్నామని చెప్పినా ఆమె వినడం లేదని, రెన్యువల్ అయితేనే బిల్లు మంజూరుకు చర్యలు తీసుకుని పరిష్కరిస్తామన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 6,850 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం,మార్చి16 : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,850 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో మొత్తం 24బెంచులు నిర్వహించారు. బాధిత, ఫిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో 1247 క్రిమినల్ కేసులు, 142 సివిల్ కేసులు, 5308 ప్రీలిటిగేషన్ కేసులు(పంచాయతీ, మున్సిపల్ టాక్సు కేసులు, బ్యాంకు రికవరీ కేసులు), 66 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులకు పరిష్కారం దక్కింది. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ప్రమాద భరిత కేసులలో రూ.3,81,65,000లను కక్షిదారులకు పరిహారం ఇప్పించటానికి రాజీ మార్గంగా పరిష్కరించారు. సివిల్ కేసులలో రూ.1,14,92,964 ప్రీలిటిగేషన్ కేసులలో రూ.1,31,19,500 కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, కార్యదర్శి దీన పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

అనంతపురం క్రైం,మార్చి16 : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 సర్వీసెస్ స్ర్కీనింగ్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 33 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పది మందికి తగ్గకుండా బందోబస్తు చేపట్టామన్నారు. ప్రశ్నాపత్రాల బాక్సులను ఆయా సెంటర్లకు తరలించే సమయంలో సాయుధ పోలీసు బృందాల సెక్యూరిటీ నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరికైనా ఇబ్బందులు కలిగితే అభ్యర్థులు తన ఫోన్ నెంబర్ 9440796800కు సమాచారం అందించాలని ఎస్పీ అభ్యర్థులను కోరారు.

స్పందన రద్దు

అనంతపురం టౌన్, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసేవరకు 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టరు గౌతమి శనివారం తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లోకివచ్చిన నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన రద్దు కొనసాగుతుందని, జిల్లా ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

సూపర్‌సిక్స్ పథకాలే శ్రీరామరక్ష: కాలవ


కణేకల్లులో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి కాలవ

కణేకల్లు, మార్చి 16: రాబోయే ఎన్నికలకు తమ గెలుపునకు సూపర్‌సిక్స్ పథకాలే శ్రీరామరక్ష అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కణేకల్లు పట్టణంలో మూడవరోజు ఆయన పలు వార్డులలో ప్రచారం చేశారు. కాలవ మాట్లాడుతూ మహిళలు, యువత, రైతులను దృష్టిలో పెట్టుకుని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఉమ్మడిగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల ముందు ఉంచారన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి వస్తే ఎలాంటి లబ్ధి చేకూరుతుందో అర్థం చేసుకొని ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా అన్ని వర్గాలతో ఆయన మాట్లాడుతూ తాము మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, ఎస్‌కే మల్లికార్జున, కళేకుర్తి సుదర్శన్, ఆది, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, అనిల్, వన్నారెడ్డి, బసవరాజు, ఉండాల హనుమంతరెడ్డి, చంద్రశేఖర్‌గుప్తా, షేక్‌హుస్సేన్, ఎంసీ సర్మాస్, వరుణ్, ప్రకాష్, అంజిబాబు, ఎల్లప్ప, కురుబ నాగరాజు, చాంద్‌బాషా, మాబుసాబ్, వెంకటేశులు, ఆంజినేయులు, చిన్న సలీం, అబ్దుల్, శరభన్‌గౌడ్, నరేష్, అశోక్, జయశీలా రెడ్డి, విజయ్, జనసేన నాయకులు రవి, రాము, మణికంఠ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, మార్చి 16: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈవో విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది మారుతి పాల్గొన్నారు.

సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు


అలంకరణలో సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులు

యాడికి, మార్చి 16: మండల కేంద్రంలో సీతారాముల ఆలయానికి నూతనంగా బహూకరించిన ఉత్సవమూర్తులను శనివారం ఊరేగింపు చేశారు. యాడికికి చెందిన ఓగేటి విజయలక్ష్మి, సూర్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయానికి బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన వీధుల గుండా స్వామివార్లను ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు హాస్పిటల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


అలంకరణలో స్వామివారి బృందావనం

తాడిపత్రిటౌన్, మార్చి 16: పట్టణంలోని మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం స్వామివారి 428వ ఆరాధనోత్సవాలు వైభవం గా నిర్వహించారు. స్వామివారి బృందావనానికి నిర్మల్య విసర్జన, అష్టోత్తర పారాయణ, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పాదపూజ, కనక మహాపూజ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

బొమ్మనహాళ్, మార్చి 16: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషప్రకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు.దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదాన చేశారు. ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాపు బీజేపీలో చేరిక


బీజేపీలో చేరిన ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం, మార్చి 16: వైసీపీ తిరుగుబాటు ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి శనివారం బీజేపీలో చేరారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. ముఖ్యంగా వైసీపీలో సీనియర్ నాయకుడిగా వైఎస్ కుటుంబానికి విధేయుడుగా ఉంటూ వచ్చిన కాపునకు టిక్కెట్ దక్కలేదు. 2012 ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్ వెంట ఉండి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి పోటీ చేసి గెలిచారు. అప్పటి నుంచి వైసీపీలో ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తూ రాయదుర్గం ఎమ్మెల్యేగా ఉంటూ ప్రభుత్వ విప్‌గా కూడా కొనసాగారు.

ఏఆర్ ఏఎస్ఐ ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, మార్చి 16: పట్టణంలోని అంజలి నగర్‌లో నివాసముంటున్న ఏఆర్ ఏఎస్ఐ రామకృష్ణ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోని వెండి ఆభరణాలు, రూ.5లక్షల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. కసాపురం పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు కర్నూలు జిల్లాలో ఏఆర్ ఏఎస్ఐగా రామకృష్ణ విధులు నిర్వహిస్తున్నాడన్నారు. అతని భార్య విజయలక్ష్మి 20 రోజుల క్రితం మోకాళ్ల ఆపరేషన్ కోసం బెంగళూరులో ఉన్న అతని కుమారుడు వద్దకు వెళ్లిందన్నారు. సోమవారం రామకృష్ణ ఇంటికి తాళం వేసి డ్యూటీకి కర్నూలుకు వెళ్లాడన్నారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండుగులు ఇంటి తాళాలను పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న వెండి ప్లేట్, చెంబు, అమ్మవారి కోసం హుండీలో ఉంచిన రూ.70వేలు విలువ చేసే రూ.5 కాయిన్‌లు, చీరలు ఎత్తుకెళ్లారన్నారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలలో చోరీకి పాల్పడిన దృశ్యాలు రికార్డ్ అయ్యాయన్నారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. రామకృష్ణ భార్య విజయలక్ష్మి బెంగళూరు నుంచి వచ్చిన తరువాత బంగారు అభరాణలు ఎంత పోయాయని తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తామని ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి, మార్చి 16: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి సీజ్‌చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని రాయలచెరువులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి

రాయదుర్గంరూరల్, మార్చి 16: మండలంలోని జుంజురంపల్లి గ్రామానికి చెందిన బాబా ఫకృద్దీన్(12) అనే బాలుడు విషజ్వరంతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. జుంజురంపల్లి గ్రామానికి చెందిన సబీర్, కౌసర్‌భాను దంపతుల కుమారుడు బాబా ఫకృద్దీన్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. వారంరోజుల నుంచి జ్వరం సోకడంతో పలుచోట్ల చికిత్స అందించినప్పటికీ నయం కాకపోవడంతో రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మంజునాథ్

పుట్లూరు, మార్చి 16: పుట్లూరు డిప్యూటీ తహసీల్దార్‌గా మంజునాథ్‌ను శనివారం ఉన్నతాధికారులు నియమించారు. ఈయన అనంతపురం ఆర్వో కార్యాలయం నుంచి డెప్యూటేషన్‌పై పుట్లూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లేష్‌ప్రసాద్ బదిలీపై అనంతపురం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా వెళ్లారు.

బీటీపీ కాలువను పూర్తి చేస్తాం: అమిలినేని


గజమాలతో అమిలినేనిని సన్మానిస్తున్న రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ

కళ్యాణదుర్గం, మార్చి 16: కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలకు జీవనాడి అయిన బీటీపీ కాలువను సకాలంలో పూర్తిచేసి సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కంబదూరులో సుమారు ఐదు వేల మందికి పైబడి టీడీపీ సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్టు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఊరేగింపు చేపట్టారు. శ్రీకృష్ణదేవరాయలు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అమిలినేని మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, రహదారులు అధ్వానంగా వున్నాయన్నారు. ఎలాంటి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు లేవన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ ఒకటి ప్రతిపాదనలో వుందంటున్నారు. గతంలో ఏపీఐఐసీ ద్వారా వెయ్యి ఎకరాల భూమిని సేకరించారని, పరిశ్రమలు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రధానంగా రహదారులు, పాఠశాలలు, ఆస్పత్రులు, పరిశ్రమల ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానన్నారు. మనందరి ధ్యేయం కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీ కంచుకోటలో పార్టీ జెండా ఎగురవేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీఎంగా చంద్రబాబునాయుడును గెలిపించుకుంటూ గ్రామగ్రామాన టీడీపీ విజయం సాధించే దిశగా కృషి చేద్దామన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, జనసేన నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మనమే నిలుస్తున్నాం.. గెలుస్తున్నాం: జితేంద్రగౌడ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

పామిడి, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గంలో మనమే నిలుస్తున్నాం.. మనమే గెలుస్తున్నాం అని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలోని మాజీ ఎంపీపీ అంజనేయులుగౌడ్ స్వగృహంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు టీడీపీ బలోపేతానికి కష్టపడి పనిచేశామన్నారు. టీడీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి పార్టీ కమిటీలలో పదవులు ఇచ్చామన్నారు. అనంతరం పలువురు స్థానిక నాయకులు మాట్లాడుతూ... కుల, మత ప్రాతిపదికన ఎలా అభ్యర్థిని ప్రతిపాదిస్తారని, కులాలతో ఏ నాయకుడు రాజకీయాలలో రాణించలేడన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. పార్టీలోకి చేరిన వారందరికీ టికెట్లు ఇవ్వరన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం : ఇటీవల పట్టణంలో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్తలు అనారోగ్యాలకు గురై మృతిచెందారు. వడదెబ్బకు గురై మృతి చెందిన ఓబులేసు కుటుంబానికి రూ.10 వేలు, మాజీ వార్డు మెంబర్ ఆదినారాయణ కుటుంబానికి రూ.10 వేలు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ ఆర్థికసాయం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్ పీరా, ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, గుంతకల్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు రామాంజనేయులు, చెన్నవరం మహబూబ్‌బాషా, టీటీ రమణరావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామాంజనేయులు నాయక్, కుమార్, రమేష్ నాయక్, మహమ్మద్ రఫీ, ఆనంద్, రామకృష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మా మోహన్ కృష్ణ, సుదర్శన్, రంగస్వామియాదవ్, సూరి, మనోహర్, మస్తాన్, జాఫర్, బాబా పాల్గొన్నారు.

అసెంబ్లీ టిక్కెట్టు నాకే

గుంతకల్లు: పార్టీ అధిష్టానం గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్టును తనకే కేటాయిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడు పేర్కొన్నారు. శనివారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను ఇన్‌చార్జిగా ఐదేళ్లపాటు ఎన్నో కార్యక్రమాలను నిర్వహించానని అన్నారు. ఎన్నికల సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలసి టిక్కెట్టును కోరగా, తప్పక కేటాయిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. కానీ పార్టీ టిక్కెట్టు తమదేనంటూ కొందరు వచ్చి పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, వాటిని కార్యకర్తలు నమ్మరాదన్నారు.

వచ్చేది చంద్రబాబు పాలనే


టీడీపీ కార్యాలయం ఎదుట సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, మార్చి 16: ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పట్టిపీడించిన సైకో జగన్ రెడ్డి పరిపాలన పోయిందని, వచ్చేది చంద్రన్న పాలనేనని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. శనివారం కళ్యాణదుర్గం ఎన్టీఆర్ భవన్ ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో రాష్ట్రంలో సైకో జగన్ రెడ్డి పాలనకు ఫుల్ స్టాప్ పడిందన్నారు. ఈ సైకో పాలన కనువిప్పు కలిగిందని, రాష్ట్ర ప్రజలు ఎంతో ఉపశమనం పొందారన్నారు.

టిక్కెట్ ఇవ్వకున్నా ప్రచారాలా?

గుంతకల్లు, మార్చి 16: నియోజకవర్గ టిక్కెట్టును ప్రకటించకున్నా పక్క నియోజకవర్గం నుంచి వచ్చి ప్రచారాలు చేయడం ఏమిటని టీడీపీ నాయకుడు ఆర్ ధర్మతేజ్ గౌడు ప్రశ్నించారు. శనివారం ఉదయం పట్టణంలోని జితేంద్రగౌడు క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పక్క నియోజకర్గానికి చెందిన వ్యక్తులు గుంతకల్లు టిక్కెట్టును పార్టీ అధిష్టానం ప్రకటించకున్నా ఇలా ఇష్టానుసారంగా వ్యవహరించడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. టీడీపీ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలోకి వచ్చినవారులు ఇక్కడి మర్యాదలను పాటించడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడుకే అధిష్టానం టిక్కెట్టును కేటాయిస్తుందన్న నమ్మకంతో తామున్నామన్నారు. అటువంటి పరిస్థితుల్లో కార్యకర్తలు, ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా, మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించడం పద్ధతి కాదన్నారు. గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, టీ మస్తానప్ప, పాల మల్లికార్జున, హనుమంతు, శివన్న పాల్గొన్నారు.

గుమ్మనూరు జయరాంను విమర్శించడం తగదు

గుత్తి, మార్చి 16: కౌన్సిలర్‌గా గెలవలేని వారు కూడా గుమ్మనూరు జయరాంను విమర్శించడం తగదని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక అనంతపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో న్యాయవాది సోమశేఖర్ మాట్లాడారు. గుంతకల్లు పట్టణంలో కౌన్సిలర్‌గా గెలవలేని కొందరు నేతలు మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను ఏకవచనంతో సంబోధిస్తు విమర్శించడం అతని స్థాయికి తగదన్నారు. ప్రతిసారి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి పదే పదే జయరాంను విమర్శించడం తగదని, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సబబు కాదన్నారు. అధిష్టానం గుంతకల్లు టిక్కెట్ జయరాంకు కేటాయిస్తే ఆయన గెలుపు కోసం పాటుపడాలన్నారు. ఎంపీటీసీ నారాయణస్వామి, కృష్ణ, ప్రకాష్, నాగేంద్ర, సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి బాబుతోనే సాధ్యం


గుంతకల్లులో ప్రజలకు నమస్కరిస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్, మార్చి 16: బీసీల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జి ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో ఆ వార్డు ఇన్చార్జి తలారి మస్తానప్ప ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం 50సంవత్సరాల నిండిన వారికి రూ.4వేలు పింఛన్ అందిస్తారన్నారు. రూ.10 చెల్లిస్తే చంద్రన్న బీమా కింద రూ.10లక్షలు, పెళ్లికానుక, బీసీలకు రక్షణ చట్టం, అన్ని కులాలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తారన్నారు. నాయకులు ఆర్ పవన్‌కుమార్ గౌడ్, అనిల్‌గౌడ్, తలారి సరోజమ్మ, తలారి శివ పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: రాయదుర్గం నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే మరొకసారి కాలవ శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని కాలవ భరత్ అన్నారు. మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో శనివారం సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కాలవ శ్రీనివాసులుతోనే సాధ్యమన్నారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు హేమ్లానాయక్, భోజరాజు, గోనబావి రమేష్, కిష్టప్ప పాల్గొన్నారు.

ఉరవకొండ: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలు నష్టపోయారని ఎమ్మెల్యే తనయుడు విజయ్‌సింహ ఆరోపించారు. వజ్రకరూరు మండలంలోని చాబాలలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు. టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. నూతేటి వెంకటేష్, నాగేంద్ర, ఎర్రిస్వామి, అనంతయ్య, గోపాల్, ఈశ్వర్, లింగమూర్తి, రామాంజనేయులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని తూర్పుపాలెం, నుంకులమ్మపాలెంలో శనివారం బలిజ సంఘం ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సంఘం నాయకులు మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. సూపర్‌సిక్స్ పథకాలతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మాజీ కౌన్సిలర్లు చల్లా రఘు, శివమ్మ, బలిజ సంఘం నాయకులు ఆదినారాయణ, చల్లా రామ్‌నాథ్, శ్రీరంగయ్య, గండికోట కార్తీక్, చంద్రశేఖర్, చల్లా సురేష్, శీనా, విశ్వనాథ్, రమేష్, అవినాష్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ నాయకురాలు సుశీలమ్మ అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగుడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆమె స్థానిక నాయకులతో కలిసి భవిష్యత్ గ్యారెంటీపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. స్రవంతి, అశోక్, గోవర్దన్, చిరంజీవి, సుంకన్న, నాగన్న పాల్గొన్నారు.


వజ్రకరూరులో...


రాయదుర్గం మండలం ఆర్బీ వంకలో...


తాడిపత్రిలో...


బెళుగుప్ప మండలం ఎర్రగుడిలో...

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

ఉరవకొండ,మార్చి16: వజ్రకరూరు మండలం కమలపాడు గ్రామంలోని కురుబ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. కౌకుంట్ల గ్రామంలో టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు వైసీపీ నాయకులు బండయ్య, పెద్దరంగన్న, దేవేంద్ర, గోపాల్, రాజశేఖర్, భరత్‌లకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

ఉరవకొండ, మార్చి 16: లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయపరిష్కారం లభిస్తుందని న్యాయాధికారి దుర్గా కల్యాణి అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 141 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. న్యాయవాదులు రామ్మోహన్, తుకారాం, జయరాజ్, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గం: జాతీయ లోక్‌అదాలత్‌లో శనివారం 208 కేసులు రాయదుర్గం కోర్టులో పరిష్కరించినట్లు న్యాయాధికారి ఓంకార్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో రాజీ కాదగిన కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కేసుల పరిష్కారం వల్ల కాంపౌండ్ ఫీజు వల్ల రూ.2,86,523 వచ్చినట్లు వెల్లడించారు.

పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి

గుత్తి, మార్చి 16: పదో తరగతి పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి సౌకర్యం, ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు లక్ష్మీప్రసాద్, తౌసీఫ్, షేక్షావలి, ఆరీఫ్, ఇస్మాయిల్, తేజ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు న్యాయం చేయండి

తాడిపత్రిటౌన్, మార్చి 16: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు న్యాయం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నెహ్రూపార్కు ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎన్నికల స్టంట్‌గా 18 రకాల చేతివృత్తిదారులకు పీఎం విశ్వకర్మ పథకం ప్రారంభించిందన్నారు. నాలుగునెలలు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదన్నారు. లబ్ధిదారులకు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. చేతి వృత్తిదారుల సంఘం కార్యదర్శి సూరి, ఏఐటీయూసీ రమణ, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్క సీటైనా ఇవ్వాలి

గుంతకల్లుటౌన్, మార్చి 16: అనంతపురం జిల్లాకు ఒక్క ఎమ్మెల్యే సీటైనా కేటాయించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి మెయిల్ ద్వారా విజ్ఞప్తిని పంపినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాలో 30 సంవత్సరాల నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు ఎంతో మంది ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా అనంతపురం జిల్లాకు బీజేపీ తరఫున ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనవద్దు

రాయదుర్గంరూరల్, మార్చి 16: ఎన్నికల నిబంధనల మేరకు పార్టీ ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే చర్యలు తప్పవని వీఆర్వో కరుణకుమారి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీ నాయకులు అభ్యర్థులు తీసుకోవాల్సిన విధివిధానాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్లల, టీడీపీ నాయకులు పసుపులేటి రాజు, వైసీపీ శివ, ఆమ్‌ఆద్మీ వెంకటరమణబాబు, కాంగ్రెస్ పార్టీ అనిల్‌కుమార్, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి

యాడికి, మార్చి 16: ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ నాగార్జునరెడ్డి కోరారు. శనివారం రాయలచెరువులో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో నిర్వహించేలా గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ

యాడికి, మార్చి16: కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థులకు యాడికి మండలం రిపోర్టర్లు శనివారం అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. మండల రిపోర్టర్ల సం ఘం గౌరవ అధ్యక్షుడు షణ్ముఖరెడ్డి, అధ్యక్షుడు ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం అట్టలు, పెన్నులు అందించామన్నారు. రిపోర్టర్లు లక్ష్మినారాయణ, హుస్సేన్, హేమాద్రి పాల్గొన్నారు.

అమరజీవి జీవితం అందరికీ ఆదర్శం: అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితచరిత్ర అందరికీ ఆదర్శమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని అశ్మిత్‌రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో..: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు జయవరం అశ్వత్థరంగయ్య, వంకదారి రాజా, సుబ్రహ్మణ్యం, శివ, మద్దిలేటయ్య పాల్గొన్నారు.

యాడికి: అమరజీవి పొట్టిశ్రీరాములు తాగ్యం వెలకట్టలేనిదని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని శనివారం యాడికిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, నాగరాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

గుంతకల్లు: తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణాలనర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువరానిదని ఆర్యవైశ్య సంఘ పట్టణాధ్యక్షుడు గోపా జగదీశ్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గుంతకల్లు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూల మాలను వేసి నివాళులర్పించారు. వేసవిలో మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ చేపడతామని ఆయన తెలిపారు. సంఘ కార్యదర్శి కే కృపాకర్, కోశాధికారి వెంకటేశులు, పరుచూరు చెన్నకేశవులు గుప్త, దారా రామ్మోహన్, కోట రఘుబాబు, అవోపా సభ్యులు పాల్గొన్నారు.

గుత్తిరూరల్: మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పొట్టిశ్రీరాములు 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాదు ఓబులపతి, ఉపాధ్యాయులు సులోచన, సాధన, సుజాత, నిరుపమ, శివశంకర్, రామకృష్ణయ్య, శివప్రసాద్, రత్నకుమారి, మాదన్న పాల్గొన్నారు.


తాడిపత్రిలో అమరజీవికి నివాళి అర్పిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి


యాడికిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు...


గుంతకల్లులో...